ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 1 ఏప్రిల్ 2025





ఒంటిమిట్ట కోదండరామాలయం..

ఒంటిమిట్ట అభివృద్ధికి గ్రహణం

- చంద్రబాబు హయాంలో రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్
- దాదాపు 60 శాతం పనులు పూర్తి
- మిగిలిన పనులు పూర్తి చేయని జగన్
- ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం
- ఇప్పటికీ పూర్తి కాని కల్యాణ మండపం
- చంద్రబాబు సీఎం కావడంతో.. ఒంటిమిట్ట అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు
- 5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



ఇంకా పూర్తి కాని రక్షిత మంచినీటి పథకం

రాజంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విడిపోయిన తరువాత భద్రాచలం రీతిలో ఎంతో ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉన్న కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా ప్రకటించారు. ప్రకటించిన తరువాత ఒక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వమే కల్యాణోత్సవ ఏర్పాట్లు చేసింది. తదనంతరం ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పజెప్పారు. ఆ సమయంలో టీటీడీ నుంచి రూ.100 కోట్ల నిధులను కేటాయించి కోదండరామాలయాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆ నిధులతో నిత్యం కరువుతో ఇబ్బందులు పడుతున్న ఒంటిమిట్ట ప్రాంతంలో రైతులను ఆదుకోవడంతో పాటు పర్యాటక శోభ పెంచేలా ఒంటిమిట్ట చెరువును నీటితో నింపి హైదరాబాదు ట్యాంక్‌బండ్‌రీతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమశిల వెనుక జలాల నుంచి ఆరు నెలల వ్యవధిలో సుమారు 15 కి.మీ మేర ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకం ట్యాంకులను, మోటార్లను ఏర్పాటుచేశారు. శ్రీరామ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసి ఒంటిమిట్ట చెరువుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నీరందించింది. ఇక మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.60 కోట్లతో ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సుమారు లక్ష మంది వీక్షించే విధంగా కల్యాణ మండపం ఏర్పాటు, మాడవీధుల ఆధునికీకరణ, ఉద్యానవనాల ఏర్పాటు, ప్రత్యేక క్యూలైన్ల నిర్మాణం, అన్న ప్రసాద సత్రం.. ఇలా ఎన్నో నిర్మాణాలు చేపట్టారు. అయితే కల్యాణమండపం సగం మాత్రమే పూర్తయింది. మిగిలిన భాగాన్ని నిధుల లేమితో జగన్ ప్రభుత్వం చేపట్టలేదు.

శ్రీరామ ఎత్తిపోతల పథకానికి తుప్పు

తెలుగుదేశం హయాంలో రూ.33.44 కోట్లతో ఏర్పాటు చేసిన శ్రీరామ ఎత్తిపోతల పథకం ఒంటిమిట్ట అభివృద్ధిలో కీలకమైంది. ఆ పథకం నిర్వహణలో కూడా జగన్ ప్రభుత్వం విఫలైమంది. ప్రస్తుతం ఈ పథకం పైపులన్నీ పూర్తిగా పాడైపోయాయి. ఈ పైపుల స్థానంలో సుమారు రూ.11 కోట్ల ఖర్చుతో ఇనుప పైపులైన్లు కొత్తగా వేసి పథకాన్ని పునరుద్ధరిస్తే తప్ప సోమశిల ద్వారా చెరువుకు నీరు వచ్చే పరిస్థితి లేదు. బ్రహ్మోత్సవాల సమయంలో చెరువులో పుష్కలంగా నీరుంటే ఆలయం చుట్టూ ప్రకృతి శోభ కనిపించేది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒంటిమిట్ట చెరువు పైపు లైనును పునరుద్ధరించి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ఇటీవలే రాష్ట్ర టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేశం ఒంటిమిట్టకు చుట్టుపక్కల ఆలయాలను కలుపుకుంటూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఒంటిమిట్ట చెరువుకు నీరందించి బోటు షికారు నిర్వహించి టూరిజం హబ్‌గా మారుస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటకశాఖ కూడా కేంద్రం నిధులతో అభివృద్ధి చేయడానికి నిర్ణయించిందని చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీలన్నీ వీలైనంత తొందరగా కార్యరూపం దాల్చాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.



శ్రీరామ ఎత్తిపోతల పథకం పూర్తి కాకపోవడంతో అరకొర నీటితో ఒంటిమిట్ట చెరువు

కనిపించని ఆధ్యాత్మిక, పర్యాటక శోభ


చంద్రబాబునాయుడు ఆలోచనకు తగ్గట్టు రూ.100 కోట్ల మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఇక్కడ ఆధ్యాత్మికత ఉట్టిపడే రీతిలో అభివృద్ధి జరగలేదు. టూరిజమూ అభివృద్ధి చెందలేదు. చాలా పనులు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

- ఆలయానికి సమీపంలో చెరువు కట్టపై అంజనేయుడు, జాంబవంతుడు, శ్రీరాముని విగ్రహాలు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయలేదు.
- ఒంటిమిట్ట ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేస్తామన్న ధ్యానమందిరం జాడే లేదు.
- ఆలయానికి అనుకుని ఉన్న ప్రధాన హైవే మార్గంలో రాత్రి వేళ కనువిందు కలిగించేలా విద్యుద్దీపాలను ఏర్పాటు చేయలేదు.
- తిరుమల రీతిలో ఒంటిమిట్టలో సదుపాయాలు కల్పించి ఆధ్యాత్మిక శోభను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు తగ్గట్టు ఏ పనీ చేయలేదు. ఆలయం చుట్టూ ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో కోదండరాముని స్వాగత తోరణాలు ఏర్పాటు చేయలేదు. బ్రహ్మోత్సవాల వేళ టీటీడీ సిబ్బంది అంతా ఒంటిమిట్టకు చేరుకుని ఆర్భాటంగా పనులు చేస్తారు తప్ప ఆ తర్వాత ఏడాదిలో ఒక్కసారి కూడా మచ్చుకైనా కనిపించరు. అలా కాకుండా ఒంటిమిట్టను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా నాటి చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఈ ఆలయాన్ని దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అప్పట్లోనే రూ.100 కోట్ల మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆ మేరకు పనులు మొదలుపెట్టి దాదాపు 60శాతం పూర్తి చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి కడప జిల్లా వాసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒంటిమిట్ట కోదండరామాలయంలో అభివృద్ధి పనులు ఒక్కటీ జరగలేదు. సరికదా.. చంద్రబాబు హయాంలో చేపట్టిన పనులనూ పట్టించుకోలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండడంతో ఇక ఒంటిమిట్ట దశ మారుతుందని ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణం రోజున ముఖ్యమంత్రి రానున్నందున ఒంటిమిట్ట అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తారని భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అసంపూర్తిగా కల్యాణ మండపం

ఒంటిమిట్ట కోదండరామాలయ అభివృద్ధిలో ప్రధానమైనది కల్యాణ మండపం. బ్రహ్మోత్సవాల సమయంలో ఇక్కడ సీతారాముల కల్యాణం రాత్రివేళ జరుగుతుంది. ఆ రోజున లక్ష మందికి పైబడి భక్తులు ఇక్కడకు విచ్చేస్తారు. కల్యాణ మండపం లేని సమయంలో వీచిన భారీ ఈదురు గాలులకు తాత్కాలిక రేకుల షెడ్డు పడిపోయి అప్పట్లో పలువురు చనిపోయారు. ఇలాంటి ప్రమాదాలను అరికట్టడానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్యాణ మండపం నిర్మాణాన్ని ప్రారంభించారు. చకచకా పనులు జరిగినా 50 శాతం మాత్రమే కల్యాణ మండపం పూర్తయింది. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని పూర్తి చేయాల్సి ఉంది.



అసంపూర్తిగా ఉన్న కోదండరాముని కల్యాణ మండపం

రాయచోటిలో జువెనైల్ జస్టిస్ బోర్డు

- ఏర్పాటుకు సన్నాహాలు

కలికిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జిల్లా జువెనైల్ జస్టిస్ బోర్డు ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. బాలల రక్షణ, సంరక్షణ, సంక్షేమం, న్యాయ సహాయం, విద్య వైద్య సేవలు, పునరావాస కేంద్రాలు తదితర అంశాల్లో బాలలకు చట్టబద్ధమైన సేవల పర్యవేక్షణ కోసం ఈ బాలల న్యాయ మండలిని ఏర్పాటు చేస్తున్నారు. జువెనైల్ జస్టిస్ చట్టం మేరకు ప్రతి జిల్లాలో కనీసం ఒక న్యాయ మండలిని ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం కొత్త జిల్లాల్లో ఈ బోర్డులు ఏర్పాటు కాలేదు. తాజాగా కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో ఈ బాలల న్యాయ మండళ్లను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఆ క్రమంలోనే జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఈ మండలి ఏర్పాటుకు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ మండలి ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. ఈ జువెనైల్ జస్టిస్ బోర్డుకు ఒక అధ్యక్షుడితో పాటు మరో నలుగురు సభ్యులను నియమించనున్నారు. ఈ మండలిలో పనిచేసేందుకు ఆసక్తి, అర్హతలున్న వారు నేరుగా ఆ శాఖకు దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఏప్రిల్ 9వ తేదీ సాయంత్రం 5.30 గంటలలోగా దరఖాస్తులు కార్యాలయానికి చేరాల్సి ఉందని ప్రకటించారు. దరఖాస్తు ఫార్మాట్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనే అందుబాటులో ఉంచారు.

జువెనైల్ బోర్డు అధికారాలు, కమిటీ అర్హతలు

భారతీయ చట్టాల ప్రకారం 18 ఏళ్లు నిండని వారిని మైనర్‌లని అంటారు. అదే 18 ఏళ్లు నిండని వారు నేరారోపణల్లో, లేదా సమాజంచే తిరస్కరించబడి నిస్సహాయులుగా నిలిచే వారిని జువెనైల్‌గా పరిగణిస్తారు. ఇలాంటి నిస్సహాయులకు జువెనైల్ సంరక్షణ కేంద్రాలు తదితర సదుపాయాలున్నాయి. వీరికి అవసరమైన న్యాయ సహాయానికి కూడా ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారాలను చట్టపరంగా పర్యవేక్షించడానికి ఏర్పాటయ్యేవే జువెనైల్ జస్టిస్ బోర్డు లేదా బాలల న్యాయ మండలి లేదా చైల్డ్ వెల్‌ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీలు.

కడప జిల్లాలో 10 మండలాల్లో కరువు

- ప్రకటించిన ప్రభుత్వం

కడప రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 9 మండలాలు తీవ్ర కరువుతో ఇబ్బంది పడుతుండగా ఒక మండలంలో మోస్తారు కరువు ఉందని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఇందులో దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, కాశినాయన, ఖాజీపేట, చాపాడు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తొండూరు తీవ్రమైన కరువు మండలాలుగా.. మైలవరంను మోస్తారు కరువు మండలంగా సూచించింది. ఈమేరకు కలెక్టర్ అవసరమైన తదుపరి చర్యలు తీసుకోనున్నారు. రైతులు రుణ సదుపాయం పొందేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా జిల్లా గెజిట్‌లో నిర్దిష్ట మండలాలను, ప్రాంతాలను తెలియజేయనున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

జిల్లాలో రూ.3.59 కోట్లతో పశువుల నీటితొట్లు

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

7



అటవీ ప్రాంతంలో నిప్పు

- కాలిన మామిడి చెట్లు, పైపులు

7



వృద్ధాశ్రమంపై తేనెటీగల దాడి

- 8 మంది వృద్ధులకు తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

7

కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



కల్యాణ వేదికను పరిశీలిస్తున్న కడప కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మం, తదితరులు

ఒంటిమిట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్టలోని టీటీడీ పరిపాలన భవన సమావేశ మందిరంలో ఎస్పీ అశోక్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మం, డీఆర్వో విశ్వేశ్వర్‌నాయుడుతో కలిసి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 5 నుంచి 15వ తేదీ వరకు కోదండరాముడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయన్నారు. 11న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా విద్యుద్దీపాలంకరణ, తోరణాలు, పుష్పాలంకరణ, స్వాగతం, ఎల్‌ఈడీ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ టీటీడీ అధికారులు జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి కోదండరాముడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టామన్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ కోదండరాముడి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ కోదండరాముడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు శ్రావణకుమార్‌లు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం కల్యాణవేదికతో పాటు ఆలయ పరిసరాలను కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, జిల్లా వైద్యాధికారి నాగరాజు, సీపీవో వెంకటరావు, పీఆర్‌ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణయ్య, తహసీల్దారు రమణమ్మతో పాటు జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- రంజాన్ ప్రార్థనల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా ఘనంగా రంజాన్ వేడుకలు

రాయచోటిటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని పాత రాయచోటికి సమీపంలో గల హజరత్ జమాలుల్లా ఈద్గాలో ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటూ ప్రభుత్వపరంగా అందాల్సిన పథకాలన్నీ వారికి కేటాయిస్తున్నారని తెలిపారు. రాయచోటి పట్టణంలోని హిందూ-ముస్లింలు సోదర భావంతో కలిసి మెలిసి జీవించి మన ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. రంజాన్ ప్రార్థనలు అనంతరం మంత్రి ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ప్రార్థనల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పీలేరులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిల్లావ్యాప్తంగా ముస్లింల సామూహిక ప్రార్థనలు

జిల్లావ్యాప్తంగా సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాలో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదనపల్లెలోని బెంగళూరు రోడ్డులో గల ఈద్గాలో భారీగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఈద్గాలో ప్రార్థనలు చేశారు. రైల్వేకోడూరులోని ఈద్గాలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు టీడీపీ నాయకులు కేకే చౌదరి, పంతగాని నరసింహప్రసాద్, జనసేన నాయకులతో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే పీలేరులోని ఈద్గాలో భారీగా ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు.





మదనపల్లెలోని బెంగళూరు రోడ్డులో గల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రైల్వేకోడూరులో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కూటమి నాయకులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

- గుంతకల్లు-తిరుపతి మార్గంలో ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు ప్రారంభం



ములకలచెరువు మీదుగా వెళ్తున్న ప్యాసింజర్ రైలు

ములకలచెరువు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ములకలచెరువు మీదుగా గుంతకల్లు జంక్షన్ (కదిరిదేవరపల్లె)కు నడిచే ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు ఎట్టకేలకు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన కుంభమేళాకు ఈ మార్గంలో నడిచే ప్యాసింజర్ రైళ్లను మళ్లించారు. దీంతో ఈ మార్గంలో ఉదయం, రాత్రివేళల్లో నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్లు మూడు నెలల పాటు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో రైళ్లలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనెల 30వ తేదీ వరకు రైళ్ల రద్దును కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఉదయం నడిచే గుంతకల్లు జంక్షన్-తిరుపతికి, రాత్రి నడిచే తిరుపతి-గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించారు. మంగళవారం నుంచి మరో రెండు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో మంగళవారం నుంచి ప్రతిరోజూ ఈ మార్గంలో నాలుగు ప్యాసింజర్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయి.

ప్యాసింజర్ రైళ్లకు కొత్త నెంబర్లు

ములకలచెరువు మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లకు రైల్వేశాఖ కొత్త నెంబర్లను కేటాయించింది. మారిన రైళ్ల నెంబర్లు ఈ ఏడాది జనవరి 1వతేదీ నుంచి అమలులోకి వచ్చాయి. అయితే ఈ రైళ్లను కుంభమేళాకు మళ్లించడంతో మూడు నెలల పాటు రద్దయ్యాయి. దీంతో కొత్తగా కేటాయించిన నెంబర్లు ప్రయాణికులకు తెలియలేదు. మారిన రైళ్ల నెంబర్లు ఈ విధంగా ఉన్నాయి.

ప్యాసింజర్ రైలు	పాత నెంబరు	కొత్త నంబరు
తిరుపతి-గుంతకల్లు (ఉదయం)	07656	57403
గుంతకల్లు-తిరుపతి (ఉదయం)	07655	57404
తిరుపతి-కదరిదేవరపల్లె (రాత్రి)	07589	57405
కదరిదేవరపల్లె-తిరుపతి (రాత్రి)	07590	57406

నీటిలో మునిగి యువకుడి మృతి


యువకుడి మృతదేహం

జమ్మలమడుగు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెన్నానది వంతెన కింద ఉన్న నీటి గుంతలలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జమ్మలమడుగు పట్టణంలోని కాపువీధికి చెందిన పగడాల ఆదిలక్ష్మి ఇళ్లలో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె మొదటి కుమారుడు లోకేశ్ (24)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. దీంతో ఎవరికీ చెప్పకుండా ఎక్కడెక్కడికో వెళ్లిపోతుంటాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె లోకేశ్ కాళ్లను తాడుతో కట్టేసి పనికి వెళ్లింది. అయితే, ఉదయం 8 గంటల సమయంలో కట్టు తొలగించుకున్న లోకేశ్ కనిపించకుండా పోయాడు. కాగా, అతను స్థానిక ముద్దనూరు రోడ్డులోని వంతెన కింద పెన్నానదిలోని నీటి గుంతల్లో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయినట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతదేహాన్ని బయటికి తీశారు. సాయంత్రం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుని తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


మృతి చెందిన శంకర

ములకలచెరువు,మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో మదనపల్లె వాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన కంపోళ్ల శంకర(40) టెంపో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన అత్తగారి ఊరైన గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో జాతర కు హాజరయ్యేందుకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు బురకాయలకోట సమీపంలో అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనా న్ని ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ అదుపు తప్పి..

ఖాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్కూటరు అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకుబుడ్డాయపల్లెకు చెందిన చిల్లకోటి చక్రవర్తి(29) గత రాత్రి ఖాజీపేట నుంచి బుడ్డాయపల్లెకు స్కూటర్‌పై బయలుదేరాడు. అయితే, సైడ్ స్టాండు తీయక పోవడంతో బుడ్డాయపల్లె ఎస్సీ కాలనీ వద్ద వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన వృద్ధుడు

కడప క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి కనిపించడంలేదని నగర పరిధిలోని ఆర్వీఎస్ నగర్‌కు చెందిన వ్యకి ఫిర్యాదు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమ వారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన రాజు రామసుబ్బారెడ్డి (74) మధ్యాహ్నమైనా తిరిగి రాకపోవ డంతో అతని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని చేతిలో వాకింగ్ స్టిక్ ఉందని, ఎత్తు 6.1 అడుగులు, ఛామనచాయతో సన్నగా ఉంటాడని, లైట్ కలర్ షర్టు, ప్యాంటు ధరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు చిన్న చౌకు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టరు మొబైల్ నెం.9121100520, ఎస్ఐ 9121100521 నెంబర్లకు కాల్ చేసి తెలపాలని కోరారు.

ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్య


రఘురామయ్య మృతదేహం

రాజంపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక యాసిడ్ తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసు కున్నాడు.పుల్లంపేట మండలం తిప్పాయపల్లెకు చెందిన దార్ల రఘురామయ్య పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డులో 17 ఏళ్లుగా నివాసముంటూ కూలి పనులతో కుటుంబాన్ని పోషించేవాడు. మార్చి 6న అప్పుల బాధ తట్టుకోలేక ఆదివారం రాత్రి యాసిడ్ తాగాడు. విషయం గమనించిన భార్య వరలక్ష్మి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రాజంపేట పట్టణ పోలీసులుతెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

రాజంపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హస్తవరం చెర్లోపల్లె సమీపంలోని రైలు పట్టాలపై సోమవారం తలకు తీవ్రమైన గాయంతో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తికి 30 ఏళ్ల వయసుంటుందని, తెల్ల రంగు గళ్ల చొక్కా ధరించాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురికి తరలించారు.

దాడి కేసు నమోదు

ఎర్రగుంట్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): డబ్బు అడిగినందుకు సోమవారం తనపై దాడిచేశారని ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్ వెనుకవైపు నివాసముంటున్న షేక్ ఖాదర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. నజీర్, ఇంకా కొందరు ఈ దాడిలో పాల్గొన్నట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో విచారణ చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టారని గొడవ

ప్రకాష్‌నగర్ వీధిలో రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టారంటూ గొడవ పడడంతో కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దండు సతీష్ కుమార్ రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిపాడంటూ త్యాగరాజు అనే వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. దండు సతీష్‌కుమార్, మరికొందరు తనపై దాడిచేసినట్లు త్యాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అత్తపై కోడలి బంధువుల దాడి

పోట్లదుర్తి ఎన్‌టీఆర్‌కాలనికి చెందిన తెల్లాకుల రాములరమ్మపై ఆమె కోడలు కుళాయమ్మ తల్లిదండ్రులు, బంధువులు సోమవారం దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. భార్యాభర్తల విషయంలో వచ్చిన గొడవలే ఈ దాడికి కారణమన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవికి నిప్పు : మామిడి చెట్లు దగ్ధం


కాలిపోయిన మొక్కలు

సుండుపల్లె, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పంటించడంతో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న మామిడి తోటలకు మంటలంటుకున్నాయి. మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ కటారు ముడుకు సమీపంలోని అటవీ ప్రాంతానికి సమీపంలోని మిట్టబిడికీకి చెందిన మూడే లక్ష్మమ్మతో పాటు మరికొంత మందికి చెందిన కంచె, పైపులు స్టార్టరుతోపాటు సుమారు 50కి పైగా మామిడి చెట్లు దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. పొలాలు, తోటల సమీపంలో అడవికి నిప్పు పెట్టకుండా అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కొండపేట చెరువు విస్తీర్ణం వందెకరాలు.. ఆయకట్టు ఐదొందల ఎకరాలు. కొన్నేళ్లుగా ఈ చెరువు కొద్దికొద్దిగా ఆక్రమణకు గురవుతూ ప్రస్తుతం ముప్పాతిక భాగం మాత్రమే మిగిలింది. ఇదేమని ప్రశ్నిస్తే చెరువులో సాగు చేసుకుంటే మీకేం ఇబ్బంది అంటూ ఆక్రమణదారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇక అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వందెకరాల చెరువు!



- పాతిక భాగం పైగానే ఆక్రమణ
- అక్రమంగా వరి సాగు
- ఆందోళనలో కొండపేట చెరువు ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు

చెన్నూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు చెరువుల్లో పెద్దదైన కొండ పేట చెరువు వంద ఎకరాల్లో ఉన్నప్పటికీ పాతిక ఎకరాలకు పైగానే ఆక్రమణల బారిన పడడంపై ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేవస్తున్నారు. సుమారు 500 ఎకరాలకు సాగు నీరందించే కొండపేట చెరువుకు బ్రిటిషర్ల హయాం నుంచీ నీటి కేటాయింపు ఉంది. వర్షాకాలంలో చివరి దశలో కేసీ కాల్వ నీటితో ఈ చెరువు నింపితే, రైతులు వరితో పాటు ఇతర పంటలు సాగు చేసుకుంటారు. అయితే, గ్రామానికి చెందిన పలువురు గత 15 ఏళ్లుగా చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ సుమారు 30 ఎకరాల మేర కబ్జా చేసి వరి సాగు చేసుకుంటున్నారు. ఇదేమని ఇతర రైతులు ప్రశ్నిస్తే ఈ చెరువేమన్నా నీదా, మేం సాగు చేసుకుంటే మీకేం ఇబ్బంది, అధికారులే పట్టించుకోలేదు, మీకేం అవసరం అంటూ సమాధానం ఇస్తున్నారు.


చెరువు ఆక్రమించి సాగు చేస్తున్న వరి పైరు

ఆయకట్టు రైతుల ఆందోళన

కేసీ కాల్వకు అనుబంధంగా కొండపేట చెరువు ఆయకట్టు ఉన్నా నీరిచ్చేది మాత్రం నవంబరు, డిసెంబరు నెలల్లోనే. ఈ చెరువు ఒక్కసాగుకు మాత్రమే నీరందిస్తుంది. 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. చెరువులో నీరు లేనప్పుడల్లా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుగుతు న్నాయి. గ్రావెల్‌తో మండలంలో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి అనుమతులు లేకుండానే కొండపేట చెరువులో ఎక్సకవేటర్లతో తవ్వి తరలిస్తుంటారు. ఇలాంటి వారికి స్థానికులే సహకారం అందిస్తూ తాము కూడా సొమ్ము చేసుకుంటున్నారు. నీరు లేని సమయంలో ఈ చెరువును చూస్తే చెరువు నిండా గుంతలే. ఈ గోతుల కారణంగా మనుషులు, పశువులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే కనుమరుగే..

ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు చెరువుకు హద్దులు కేటాయించలేదు. చెరువు మధ్యలో సర్వేరాయి ఉందని కొందరు రైతులు చెబుతున్నా మొత్తం విస్తీర్ణంపై కొలతలు వేయాల్సి ఉంది. నాలుగు వైపులా హద్దులు ఏర్పాటు చేయాలి. ఆక్రమణలు తొలగించాలి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సంప్రదించి చెరువును పూర్తి విస్తీర్ణంతో అప్పగించాల్సిన బాధ్యత ఉందని రైతులు అంటున్నారు.

ఆక్రమణలపై దృష్టి పెడతాం

చెరువును ఆక్రమించడంనేరం. ఇది ఆయకట్టు రైతులకు ఆందోళన కలిగించే అంశం. చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. గతంలో కూడా ఈ చెరువు విషయంలో గట్టి చర్యలు తీసుకున్నాం. నీటి పారుదలశాఖ పరిధిలోకి వచ్చే చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

- సుబ్బరాయుడు, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

జిల్లాలో రూ.3.59 కోట్లతో పశువుల నీటితొట్లు

- రూ.40 కోట్లతో సిమెంటు రోడ్డు పనులు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


పశువుల తొట్టి పనులకు పూజలు చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల దాహం తీర్చేందుకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.3.59 కోట్లతో 1,115 పశువుల నీటి తొట్లు నిర్మిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం నారాయణరెడ్డిపల్లె , కొండావాండ్లపల్లెలో పశువుల నీటితొట్ల పనులను డీడబ్ల్యూఎంఏ పీడీ వెంకటరత్నం, ఎంపీడీవో రామచంద్ర, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. సంబేపల్లె మండలంలో 28 పశువుల నీటి తొట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో నీటితొట్టికి ఉపాధి హామీ పథకం కింద రూ.32,200, పని ప్రదేశంలో బోర్డు ఏర్పాటుకు రూ.1000 చెల్లిస్తున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే గ్రామాల్లో రూ.40 కోట్లతో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు బావులను తవ్విస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.300 కోట్లతో 6 మండలాల్లో 780 పల్లెలకు వెలిగల్లు ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీవో రెడ్డి జవహర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంపై తేనెటీగల దాడి


చికిత్స చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

ఓబులవారిపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లెలోఉన్న జీవన జ్యోతి ఆనందనిలయం ఆశ్రమంపై తేనెటీగలు దాడి చేశాయని ఆశ్రమ వ్యవస్థాపకుడు పాణ్యం సుబ్రమణ్యం తెలిపారు. ఆశ్రమం ప్రాంగణంలోని తేనె తుట్టెలపై ఆకతాయిలురాళ్లు వేయడంతో, ఒక్కసారిగా తేనెటీగలు రేగాయి ఈ దాడిలో 8 మంది వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను 108 వాహనం ముక్కావారిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఆకతాయిలపైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు.

పార్టీల ఐక్యతతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా..

- ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దశరథరాం రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దశరథరాంరెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్. దశరథరాంరెడ్డి కోరారు. ఆల్ ఇండియా జై హింద్ పార్టీ , సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోవడంతో, ప్రసు _త ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మారిం దన్నారు. పైపెచ్చు కేంద్రం ఇచ్చిన ప్రత్యేక రాష్ట్ర హోదా హామీ సాకారం చేసుకోలేక పోయామన్నారు. విభజన బిల్లు చర్చ సందర్భంగా నాటి ప్రధాని మన్ మోహన్‌సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఒడిశా, బుందేల్‌ఖండ్ తరహా పథకాలను అమలు చేస్తామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి కేంద్రమే పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారని తెలిపారు. ఐఐటీ, ఐఎన్‌టీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఏఐఎంఎస్ తరహా హాస్పిటల్స్, దుగరాజు పట్నం పోర్ట్, కడపలో స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, ఇండస్ట్రియల్ కారిడార్ తదితర హామీలను నెరవేర్చడంలో కేంద్రం నిమ్మకు నీరెత్తిన ట్లుగా వ్యవహరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావా లని దీక్షలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ప్రత్యేక హోదా అడగలేని అసహాయస్థితిలో ఉన్నారన్నారు. స్వీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను త్యాగం చేస్తున్న తీరు దారుణమ న్నారు.. ప్రత్యేక హోదా మరుగున పడిన అంశమే కానీ మరచిన అంశం కాదన్నారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా కోసం అన్ని రాజకీయ పార్టీలు సంఘటితమై ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలు, పన్ను రాయితీలు వస్తాయన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఆ దిశగా అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి రావాలని కోరారు. నాయకులు మర్రి రాజా శ్రీనివాస రావు, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, సి.ఆర్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ అధికారుల వైఖరికి అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న అద్దెబస్సుల డ్రైవర్లు

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైర్డ్ బస్సు డ్రైవర్ చక్రవర్తి(30) ఆత్మహత్య కు ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సోమవారం అద్దె బస్సుల డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తి , ఖాజీపేట మండలం బుడ్డాయపల్లె నుంచి డ్యూటీకి వచ్చి వెళ్లేవాడన్నారు. బస్ పాస్ రెన్యువల్ కోసం డీఎం కార్యాలయంలోని క్లర్క్ శంకర్ గౌడ్‌ను కోరాడు. మూడు రోజులు తిప్పుకున్న ఆ ఉద్యోగి రెన్యువల్ చేయకపోవడంతో, చక్రవర్తి మద్యం సేవించి క్లర్క్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అతనిపై అక్రమంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయించి కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి, రీజనల్ మేనేజర్ గోపాల్ రెడ్డి వద్దకు పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో విసిగివేసారి పోయాడన్నారు. జనవరి 25 నుంచి డ్యూటీలోకి తీసుకోకపోవడంతో మనస్తాపం చెందిన అతను బైక్‌తో లారీని ఢీకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య తెలిపిందన్నారు. ఇలాంటి సమస్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ప్రైవేట్ బస్సుల మేనేజర్లు సాల్మన్, డానియేల్, నరేష్, శ్రీను ప్రైవేట్ బస్ డ్రైవర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రసాద్, పవన్. బాబ్జి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల ఘర్షణ : ఇద్దరికి గాయాలు

కమలాపురం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ఆక్సానగర్‌కు చెందిన యువకుల ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు ర్యాష్ డ్రైవింగ్ విషయంలో సాల్మన్ అనే యువకుడిని పలుసార్లు షాబాజ్, సోయల్ అనే యువకులు మందలించారు. ఆ విషయం మనసులో పెట్టుకున్న సాల్మన్ రంజాన్ రోజు రాత్రి మద్యం తాగి అక్సా నగర్‌కు వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయడంతో షాబాజ్, సోయల్ గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులను రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో డీవైఈవో మృతి


డీవైఈవో చంద్రశేఖర్(ఫైల్)

మదనపల్లె టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం ప్రశాంతనగర్‌లో నివాసముంటున్న చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందారు. గత వారం రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్న ఆయన సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన స్వగ్రామం దేవళ చెరువులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్టీయూ నాయకులు రమణప్ప, మధుసూదన్ ఒక ప్రకటనలో ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ సద్గుణాలు కలిగి ఉండాలి

● భక్తిశ్రద్ధలతో రంజాన్.. ● సర్వత్రా ప్రత్యేక ప్రార్థనలు



రాజంపేట: రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న చమర్తి



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



నందలూరులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు



పుల్లంపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సిద్దవటంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్కిరెడ్డిపల్లె: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాజంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సద్గుణాలు, పరోపకరారం కలిగి ఉండాలని ముస్లిం మత గురువులు బోధించారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.

మత సామరస్యానికి రాయచోటి ప్రతీకగా నిలవాలి

● రంజాన్ ప్రార్థనల్లో శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): రాయచోటి మత సామర్యానికి ప్రతీకగా నిలవాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. హజరత్ జమాలుల్లా ఈద్గాలో జరిగిన నమాజ్ ప్రార్థనల్లో శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఈద్-ఉల్-ఫితర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రెడ్డివారిపల్లెకు సమీపంలోని దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. మత గురువు సర్కార్ మహమ్మద్ ప్రవక్త జన్మదినం గురించి వివరించారు.

చిన్నమండెం: మండలంలోని ముస్లింలు పెద్దమండ్యెం రహదారిలోని నమాజ్ కట్ట వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఈద్‌ముబారక్ అంటూ ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సంబేపల్లె: శెట్టిపల్లి కస్బా, దేవపట్ల కస్బా, మహమ్మద్‌నగర్, అసంజివాండ్లపల్లె, దేవళంపేట, మమ్మసాహెబ్ ఇళ్లలో ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

గాలివీడు: గుర్రాలమిట్ట ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల్లో మత పెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు.

రైల్వేకోడూరులో భక్తిశ్రద్ధలతో రంజాన్

రైల్వేకోడూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రైల్వేకోడూరు చరిత్రలో తొలిసారిగా ఐదు వేల మందితో ప్రార్థనలు నిర్వహించడం ఇదే తొలిసారి.మైసూరివారిపల్లె పంచాయతీలోని స్థలంలో ఉన్న ఈద్గాలో ప్రార్థనలు చేశారు. మత గురువు షకీల్ అహమ్మద్ ఆధ్వర్యంలో ఖురాన్ పఠించారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, జామియా మసీదు అధ్యక్షుడు ముజీబ్, మైనార్టీ నాయకులు పఠాన్ మౌలా పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన చమర్తి

రాజంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ముస్లింలకు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలను కలిసి ఆలింగనం చేసుకున్నారు. ముస్లిం మైనార్టీల కోసం కూటమి ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ముస్లిం సోదరులను కలిసి ఈద్గాల వద్ద వారిని ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలీసు పహారాలో రంజాన్ సామూహిక ప్రార్థనలు



పెనగలూరు ఈద్గా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐలు

పెనగలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాస ప్రార్థనల్లో భాగంగా సోమవారం పెనగలూరు ఈద్గా వద్ద పోలీసు పహారాలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఇటీవల పెనగలూరు పట్టణంలోని ముస్లింలలో మనస్పర్థలు ఏర్పడి రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో వేర్వేరుగా ప్రార్థనలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం పోలీసుల వరకు వెళ్లడంతో వారు గొడవలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఏఎస్‌ఐలు మల్లికార్జున, వరప్రసాద్, రాముడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అలాగే ఓబిలి, చక్రంపేట, నాయుడు వారిపల్లె ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు.

నందలూరు: మండలంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జామియా మసీదు ఈద్గాలో రంజాన్ పండుగ ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. మండలంలోని ఈద్గాల్లో ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, గురువులు మాట్లాడుతూ రంజాన్ మాసం ఔన్నత్యాన్ని వివరించారు.

పుల్లంపేట: అప్పయ్యరాజుపేట, దళవాయిపల్లె, ఖాదర్‌పేట, శ్రీరాముల మిట్ట, పుల్లంపేట గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గా మైదానానికి చేరుకుని మతపెద్ద ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చేతివృత్తుల ఐక్యవేదిక

జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రమణ

లక్కిరెడ్డిపల్లె, మార్చి31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా చేతివృత్తుల ఐక్యవేదిక అధ్యక్షుడిగా తనను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వెంకట్రమణ తెలిపారు. కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి పల్లెకు వెళ్లి ప్రజల సమస్యలపై ఆరాతీయాలని జాతీయ అధ్యక్షుడు తెలిపార న్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

సంబేపల్లె, మార్చి31(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె గృహేశ్వరి పశుపతినాథ ఆలయంలో సోమవారం అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే ఏర్పాటు చేసిన సంకీర్తనలు, హరికథ కాలక్షేపం భక్తులను ప్రజలను అలరింపజేశాయి. భాగవతార్ అనసూయ, గాత్రం జీ.రెడ్డెమ్మ, తబలా తిప్పయ్య, వయోలిన్ విజయ్‌కుమార్ కళాకారులు భక్తులను ఆధ్యాత్మిక ప్రపంచంలో ఉర్రూతలాటించడం విశేషం.

భక్తిశ్రద్ధలతో మంచాలమ్మ జాతర

నందలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన మంచాలమ్మ జాతర మహోత్సవంలో ధర్మకర్త ఇంజాం రామచంద్రనాయుడు గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యుల పిలుపు మేరకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన్ను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

నందలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కళాబంధు చిక్కాల బాలాజీరావు కొనియాడారు. బాలాజీరావు సతీమణి దివంగత చిక్కాల జయలక్ష్మి స్మారకార్థం నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్మికులు 17 మందికి ఉగాది పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాల కోసం ఒక్కొక్కరికి రూ.1000 నగదును నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, దాత చిక్కాల బాలాజీరావు చేతులమీదుగా అందజేశారు.

ముస్లింల నిరసన

రాజంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లుకు నిరసనగా రాజంపేటలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లును వెంటనే రద్దు చేయాలని ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఆందోళనలో పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం,మార్చి31(ఆంధ్రజ్యోతి):రాయచోటి నియోజకవర్గంలోని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండల కేంద్రంలో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారంపై దృష్టి సారించామన్నారు. అనంతరం సమస్యలపై వినతులు స్వీకరించారు.

సి. పొలిమేరపల్లె జాతరలో మంత్రి

చిన్నమండెం, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.పొలిమేరపల్లెలో సోమవారం నిర్వహించిన జాతరలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు అభిమానులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలు పరిష్కరించారు.

శ్మశానానికి దారి కల్పించాలి



కొత్తపల్లె దళితులతో ఆదివారం రాత్రి మాట్లాడుతున్న చంద్రశేఖర్

రైల్వేకోడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబనపల్లె కొత్తపల్లె దళితులకు శ్మశానికి దారి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులు, బీసీలు ఒకే స్థలంలో శ్మశానికి దారి లేక ఎవరైనా చనిపోయినప్పుడు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశానికి దారి కోసం చాలా సార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కాని ఇంతవరకు పరిష్కారం కావడం లేదన్నారు. అగ్రవర్ణాల వారు దళితుల భూములను ఆక్రమించుకుని పంటలను సాగు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పరిష్కారం చేయకుంటే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

పల్లమ్మ తల్లి సేవలో ఎమ్మెల్యే శ్రీధర్



పల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి తదితరులు

పెనగలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరాజపురం పంచాయతీ పల్లంపాడు గ్రామంలో సోమవారం జరిగిన పల్లమ్మ తల్లి సేవలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలిసారిగా పల్లంపాడుకు విచ్చేసిన ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మిలకు పల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు, ఎన్‌ఆర్‌పురం గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు ఆయురారోగ్య, సుఖసంతోషాలు, పాడి పంటలతో వర్థిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి, జేసీ మండల ప్రధాన కార్యదర్శి గొబ్బూరు హరికృష్ణరాయల్, మండల నాయకులు కొప్పోలు విజయభాస్కర్‌రెడ్డి, వి.పాలిరెడ్డి, ఎల్.రెడ్డయ్యరెడ్డి పాల్గొన్నారు.

నేడు అనంతంపల్లెకు ఎమ్మెల్యే రాక

పెనగలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతంపల్లె గ్రామంలో మంగళవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పర్యటించనున్నారని ఎంపీడీవో ఎస్.విజయరావు తెలిపారు. పశువుల షెడ్ ప్రారంభోత్సవం, సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ,పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనను గ్రామ ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పుల్లంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. టి.కమ్మపల్లె పంచాయతీ క్రిష్ణంపల్లెలో తోట గంగయ్యకు రూ.1,58,285, కొత్తపేట పంచాయతీ వేల్పులవారిపల్లెలో సుబ్బరాజుకు రూ.20,524, దళవాయిపల్లెలో ఉమామహేశ్వర్‌రెడ్డికి రూ.45 వేలు, పీవీజీ పల్లెలో టి.పద్మావతికి రూ.118251 చెక్కులను ఎమ్మెల్యే వారి ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, పోలూరు కృష్ణమనాయుడు, చిన్నం శివయ్య పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా చౌడేశ్వరి దేవి ఉత్సవాలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపేట, బీ.యర్రగుడి గ్రామంలో వెలిసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారంవైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి భక్తులు బోనాలు పట్టారు. ఆదివారం రాత్రి శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి ప్రథమ జ్యోతిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెలిగించారు. రెండవ జ్యోతిని తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, జాతీయ అధ్యక్షుడు బండారు రఘురామయ్య వెలిగించారు. సోమవారం గ్రామోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమంలో శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ అధ్యక్షుడు కొరకూటి నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గు దేటి రెడ్డెయ్య, ఆలయ కమిటీ సభ్యులు భోజనపు వెంకట్రమణ, లక్ష్మీనారాయణ, గోవిందు, కొరకూటి వీరనరసింహులు, భోజనపు రామయ్య, శ్రీనివాసులు, తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగరశాఖ గౌరవాధ్యక్షుడు సంగీనాథం ఆంజనేయులు, అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

సుగవాసి కొండన్నకు మంత్రి నివాళి

రాయచోటిటౌన్,మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన టీడీపీ నాయకుడు సుగవాసి కొండన్న మృతి చెందడంతో ఆయనకు నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ కొండన్న మృతి బాధాకరమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయాపజయాలను సమానంగా స్వీకరించాలి

నందలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరించాలని రైల్వే మెడికల్ అధికారి జయభాస్కర్ రావు, ఎస్‌ఐ శ్రీధర్, ఏఎస్‌ఐ మోసెస్‌లు అన్నారు. నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం కార్యాలయంలో స్మాషర్స్ గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను వీరు ప్రారంభించారు. రైల్వే లోకో పైలట్ పీఈకే మూర్తి, ప్రభుత్వ వైద్యులు హీరా సింగ్, ఆఫీసు సూపరింటెండెంట్ రవిశంకర్, న్యాయవాది ముంగీ మోహన్, మట్టి బాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్‌లు అఖిల్, దినేష్, అభినయ్, రాము, రాఘవ, ఫరూఖ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసిన బ్యాండు మేళాలతో ఆలయం చు ట్టూ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వీరభద్రుడు కోరిన కోర్కెలు తీర్చే దేవుడు అని ప్రశంసించారు. పల్లకీ ఉత్సవం అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

డీఎం అండ్ హెచ్‌వోకు సన్మానం

రాయచోటిటౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నల్లగొండ్ల కొండయ్య పదవీ విరమణ సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కొండయ్య విధులను అంకిత భావంతో నిర్వహించారన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి శైలజ, డీఐవో డాక్టర్ ఉషశ్రీ, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎన్‌ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డెమో దేవశిరోమణి, ఎస్‌వో ఓబుల్‌రెడ్డి, పీఎంవో రవికుమార్, డీపీవో మునీశ్వర్, ఎన్‌హెచ్‌ఎంఏవో ప్రసాద్, మండల వైద్యాధికారులు కొండయ్య సేవలను కొనియాడారు.

గాయపడిన యువకుడి పరిస్థితి విషమం

సిద్దవటం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. సిద్దవటం - కడప, బద్వేల్ రహదారిపై ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటనలో సంటిగారిపల్లెకు చెందిన ద్విచక్ర వాహనదారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి గాయపడటంతో రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు బాధితుడి తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

స్టేషన్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

ఒంటిమిట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసుస్టేషన్ ఆవరణంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలు జరకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా విచారించి పరిష్కరించాలన్నారు. కోదండరాముని బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ఒంటిమిట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాలకు నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు మార్గాల్లో చికెన్ షాపులు ఉన్నాయని, వీటిని తొలగించాలని, కల్యాణోత్సవ పాసుల కేటాయింపు మండలంలోని ప్రతి పంచాయతీకి 20 పాసులు ఇవ్వాలని, చెక్కభజనలు, పండరి భజనలు, అన్నదాన కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వాలని, శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయాలని తదితర అంశాలను వినతిపత్రంలో పేర్కొన్నారు.

పాడె మోసిన ఏఎస్‌ఐ

సిద్దవటం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):శాంతిభద్రతలు కాపాడడమే తమ విధి అనుకోకుండా అనాథ శవానికి పాడె మోశారో ఏఎస్‌ఐ. స్థానిక ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర మండలంలోని కనుమలోపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు ఆదివారం సాయంత్రం మృతిచెందాడని స్థానికులు తెలిపారు. సోమవారం కాశీవిశ్వనాథ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అంత్యక్రియల్లో సుబ్బరామచంద్ర పాడె మోసి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్ రైటర్ కొండయ్య, కమిటీ ట్రస్టు సభ్యులు గుండ్లకొండ రవి, నాగుల రాంప్రసాద్, దామోదర్‌రెడ్డి, లక్ష్మణ్, సురేష్, మధు పాల్గొన్నారు.



మృతదేహాన్ని మోసుకెళుతున్న ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర

నీటిలో మునిగి యువకుడి మృతి


యువకుడి మృతదేహం

జమ్మలమడుగు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెన్నానది వంతెన కింద ఉన్న నీటి గుంతలలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జమ్మలమడుగు పట్టణంలోని కాపువీధికి చెందిన పగడాల ఆదిలక్ష్మి ఇళ్లలో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె మొదటి కుమారుడు లోకేశ్ (24)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. దీంతో ఎవరికీ చెప్పకుండా ఎక్కడెక్కడికో వెళ్లిపోతుంటాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె లోకేశ్ కాళ్లను తాడుతో కట్టేసి పనికి వెళ్లింది. అయితే, ఉదయం 8 గంటల సమయంలో కట్టు తొలగించుకున్న లోకేశ్ కనిపించకుండా పోయాడు. కాగా, అతను స్థానిక ముద్దనూరు రోడ్డులోని వంతెన కింద పెన్నానదిలోని నీటి గుంతల్లో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయినట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతదేహాన్ని బయటికి తీశారు. సాయంత్రం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుని తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


మృతి చెందిన శంకర

ములకలచెరువు,మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో మదనపల్లె వాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన కంపోళ్ల శంకర(40) టెంపో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన అత్తగారి ఊరైన గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో జాతర కు హాజరయ్యేందుకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు బురకాయలకోట సమీపంలో అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనా న్ని ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ అదుపు తప్పి..

ఖాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్కూటరు అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకుబుద్దాయపల్లెకు చెందిన చిల్లకోటి చక్రవర్తి(29) గత రాత్రి ఖాజీపేట నుంచి బుద్దాయపల్లెకు స్కూటర్‌పై బయలుదేరాడు. అయితే, సైడ్ స్టాండు తీయక పోవడంతో బుద్దాయపల్లె ఎస్సీ కాలనీ వద్ద వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన వృద్ధుడు

కడప క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి కనిపించడంలేదని నగర పరిధిలోని ఆర్వీఎస్ నగర్‌కు చెందిన వ్యకి ఫిర్యాదు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమ వారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన రాజు రామసుబ్బారెడ్డి (74) మధ్యాహ్నమైనా తిరిగి రాకపోవ డంతో అతని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని చేతిలో వాకింగ్ స్టిక్ ఉందని, ఎత్తు 6.1 అడుగులు, ఛామనచాయతో సన్నగా ఉంటాడని, లైట్ కలర్ షర్టు, ప్యాంటు ధరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు చిన్న చౌకు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టరు మొబైల్ నెం.9121100520, ఎస్ఐ 9121100521 నెంబర్లకు కాల్ చేసి తెలపాలని కోరారు.

ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్య


రఘురామయ్య మృతదేహం

రాజంపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక యాసిడ్ తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసు కున్నాడు.పుల్లంపేట మండలం తిప్పాయపల్లెకు చెందిన దార్ల రఘురామయ్య పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డులో 17 ఏళ్లగా నివాసముంటూ కూలి పనులతో కుటుంబాన్ని పోషించేవాడు. మార్చి 6న అప్పుల బాధ తట్టుకోలేక ఆదివారం రాత్రి యాసిడ్ తాగాడు. విషయం గమనించిన భార్య వరలక్ష్మి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రాజంపేట పట్టణ పోలీసులుతెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

రాజంపేట టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హస్తవరం చెర్లోపల్లె సమీపంలోని రైలు పట్టాలపై సోమవారం తలకు తీవ్రమైన గాయంతో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తికి 30 ఏళ్ల వయసుంటుందని, తెల్ల రంగు గళ్ల చొక్కా ధరించాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురికి తరలించారు.

దాడి కేసు నమోదు

ఎర్రగుంట్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): డబ్బు అడిగినందుకు సోమవారం తనపై దాడిచేశారని ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్ వెనుకవైపు నివాసముంటున్న షేక్ ఖాదర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. నజీర్, ఇంకా కొందరు ఈ దాడిలో పాల్గొన్నట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో విచారణ చేస్తున్నట్లు వివరించారు.


రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టారని గొడవ

ప్రకాష్‌నగర్ వీధిలో రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టారంటూ గొడవ పడడంతో కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దండు సతీష్ కుమార్ రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిపాడంటూ త్యాగరాజు అనే వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. దండు సతీష్‌కుమార్, మరికొందరు తనపై దాడిచేసినట్లు త్యాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అత్తపై కోడలి బంధువుల దాడి

పోట్లదుర్తి ఎన్‌టీఆర్‌కాలనికి చెందిన తెల్లాకుల రాములరమ్మపై ఆమె కోడలు కుళాయమ్మ తల్లిదండ్రులు, బంధువులు సోమవారం దాడి చేసిన సంఘటనపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. భార్యాభర్తల విషయంలో వచ్చిన కారణాలే ఈ దాడికి కారణమన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవికి నిప్పు : మామిడి చెట్లు దగ్ధం


కాలిపోయిన మొక్కలు

సుండుపల్లె, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పంటించడంతో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న మామిడి తోటలకు మంటలంటుకున్నాయి. మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ కటారుముడుకు సమీపంలోని అటవీ ప్రాంతానికి సమీపంలోని మిట్టబిడికీకి చెందిన మూడే లక్ష్మమ్మతో పాటు మరికొంత మందికి చెందిన కంచె, పైపులు స్టార్టరుతోపాటు సుమారు 50కి పైగా మామిడి చెట్లు దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. పొలాలు, తోటల సమీపంలో అడవికి నిప్పు పెట్టకుండా అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కొండపేట చెరువు విస్తీర్ణం వందెకరాలు.. ఆయకట్టు ఐదొందల ఎకరాలు. కొన్నేళ్లుగా ఈ చెరువు కొద్దికొద్దిగా ఆక్రమణకు గురవుతూ ప్రస్తుతం ముప్పాతిక భాగం మాత్రమే మిగిలింది. ఇదేమని ప్రశ్నిస్తే చెరువులో సాగు చేసుకుంటే మీకేం ఇబ్బంది అంటూ ఆక్రమణదారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇక అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వందెకరాల చెరువు!



● పాతిక భాగం పైగానే ఆక్రమణ ● అక్రమంగా వరి సాగు
● ఆందోళనలో కొండపేట చెరువు ఆయకట్టు రైతులు ● పట్టించుకోని అధికారులు

చెన్నూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు చెరువుల్లో పెద్దదైన కొండ పేట చెరువు వంద ఎకరాల్లో ఉన్నప్పటికీ పాతిక ఎకరాలకు పైగానే ఆక్రమణల బారిన పడడంపై ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేఐస్తున్నారు. సుమారు 500 ఎకరాలకు సాగు నీరందించే కొండపేట చెరువుకు బ్రిటిషర్ల హయాం నుంచీ నీటి కేటాయింపు ఉంది. వర్షాకాలంలో చివరి దశలో కేసీ కాల్వ నీటితో ఈ చెరువు నింపితే, రైతులు వరితో పాటు ఇతర పంటలు సాగు చేసుకుంటారు. అయితే, గ్రామానికి చెందిన పలువురు గత 15 ఏళ్లుగా చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ సుమారు 30 ఎకరాల మేర కబ్జా చేసి వరి సాగు చేసుకుంటున్నారు. ఇదేమని ఇతర రైతులు ప్రశ్నిస్తే ఈ చెరువేమన్నా నీదా, మేం సాగు చేసుకుంటే మీకేం ఇబ్బంది, అధికారులే పట్టించుకోలేదు, మీకేం అవసరం అంటూ సమాధానం ఇస్తున్నారు.


చెరువు ఆక్రమించి సాగు చేస్తున్న వరి పైరు

ఆయకట్టు రైతుల ఆందోళన

కేసీ కాల్వకు అనుబంధంగా కొండపేట చెరువు ఆయకట్టు ఉన్నా నీరిచ్చేది మాత్రం నవంబరు, డిసెంబరు నెలల్లోనే. ఈ చెరువు ఒక్కసాగుకు మాత్రమే నీరందిస్తుంది. 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. చెరువులో నీరు లేనప్పుడల్లా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుగుతు న్నాయి. గ్రావెల్‌తో మండలంలో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి అనుమతులు లేకుండానే కొండపేట చెరువులో ఎక్సకవేటర్లతో తవ్వి తరలిస్తుంటారు. ఇలాంటి వారికి స్థానికులే సహకారం అందిస్తూ తాము కూడా సొమ్ము చేసుకుంటున్నారు. నీరు లేని సమయంలో ఈ చెరువును చూస్తే చెరువు నిండా గుంతలే. ఈ గోతుల కారణంగా మనుషులు, పశువులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే కనుమరుగే..

ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు చెరువుకు హద్దులు కేటాయించలేదు. చెరువు మధ్యలో సర్వేరాయి ఉందని కొందరు రైతులు చెబుతున్నా మొత్తం విస్తీర్ణంపై కొలతలు వేయాల్సి ఉంది. నాలుగు వైపులా హద్దులు ఏర్పాటు చేయాలి. ఆక్రమణలు తొలగించాలి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సంప్రదించి చెరువును పూర్తి విస్తీర్ణంతో అప్పగించాల్సిన బాధ్యత ఉందని రైతులు అంటున్నారు.

ఆక్రమణలపై దృష్టి పెడతాం

చెరువును ఆక్రమించడంనేరం. ఇది ఆయకట్టు రైతులకు ఆందోళన కలిగించే అంశం. చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. గతంలో కూడా ఈ చెరువు విషయంలో గట్టి చర్యలు తీసుకున్నాం. నీటి పారుదలశాఖ పరిధిలోకి వచ్చే చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

- సుబ్బరాయుడు, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

జిల్లాలో రూ.3.59 కోట్లతో పశువుల నీటితొట్లు

● రూ.40 కోట్లతో సిమెంటు రోడ్డు పనులు
● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


పశువుల తొట్టి పనులకు పూజలు చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల దాహం తీర్చేందుకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.3.59 కోట్లతో 1,115 పశువుల నీటి తొట్లు నిర్మిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం నారాయణరెడ్డిపల్లె , కొండావాండ్లపల్లెలో పశువుల నీటితొట్ల పనులను డీడబ్ల్యూఎంఏ పీడీ వెంకటరత్నం, ఎంపీడీవో రామచంద్ర, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. సంబేపల్లె మండలంలో 28 పశువుల నీటి తొట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో నీటితొట్టికి ఉపాధి హామీ పథకం కింద రూ.32,200, పని ప్రదేశంలో బోర్డు ఏర్పాటుకు రూ.1000 చెల్లిస్తున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే గ్రామాల్లో రూ.40 కోట్లతో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు బావులను తవ్విస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.300 కోట్లతో 6 మండలాల్లో 780 పల్లెలకు వెలిగల్లు ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీవో రెడ్డి జవహర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంపై తేనెటీగల దాడి


చికిత్స చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

ఓబులవారిపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లెలోఉన్న జీవన జ్యోతి ఆనందనిలయం ఆశ్రమంపై తేనెటీగలు దాడి చేశాయని ఆశ్రమ వ్యవస్థాపకుడు పాణ్యం సుబ్రమణ్యం తెలిపారు. ఆశ్రమం ప్రాంగణంలోని తేనె తుట్టెలపై ఆకతాయిలురాళ్లు వేయడంతో, ఒక్కసారిగా తేనెటీగలు రేగాయి ఈ దాడిలో 8 మంది వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను 108 వాహనం ముక్కావా రిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఆకతాయిలపైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు.

పార్టీల ఐక్యతతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా..

●ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దశరథరాం రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దశరథరాంరెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్. దశరథరాంరెడ్డి కోరారు. ఆల్ ఇండియా జై హింద్ పార్టీ , సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోవడంతో, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మారిం దన్నారు. పైపెచ్చు కేంద్రం ఇచ్చిన ప్రత్యేక రాష్ట్ర హోదా హామీ సాకారం చేసుకోలేక పోయామన్నారు. విభజన బిల్లు చర్చ సందర్భంగా నాటి ప్రధాని మన్ మోహన్‌సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఒడిశా, బుందేల్‌ఖండ్ తరహా పథకాలను అమలు చేస్తామని, పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి కేంద్రమే పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారని తెలిపారు. ఐఐటీ, ఐఎన్‌టీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఏఐఎంఎస్ తరహా హాస్పిటల్స్, దుగరాజు పట్నం పోర్ట్, కడపలో స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, ఇండస్ట్రియల్ కారిడార్ తదితర హామీలను నెరవేర్చడంలో కేంద్రం నిమ్మకు నీరెత్తిన ట్లుగా వ్యవహరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావా లని దీక్షలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ప్రత్యేక హోదా అడగలేని అసహాయస్థితిలో ఉన్నారన్నారు. స్వీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను త్యాగం చేస్తున్న తీరు దారుణమ న్నారు.. ప్రత్యేక హోదా మరుగున పడిన అంశమే కానీ మరచిన అంశం కాదన్నారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా కోసం అన్ని రాజకీయ పార్టీలు సంఘటితమై ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలు, పన్ను రాయితీలు వస్తాయన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఆ దిశగా అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి రావాలని కోరారు. నాయకులు మర్రి రాజా శ్రీనివాస రావు, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, సి.ఆర్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వీరపునాయునిపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అడవి చెర్లోపల్లె గ్రామంలో రాష్ట్ర టీడీపీ బీసీసెల్ కార్యదర్శి గండి ఓబయ్య యాదవ్ ఇచ్చిన విందుకు ఆయన హాజరయ్యారు. మండల పరిధిలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టారు. అలిదెన, మిట్టపల్లె, కొమ్మద్ది ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని, బోర్లు ఎండిపోయాయని ఎమ్మెల్యేకు తెలియజేశారు. త్వరలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తా సాయి నరసింహారెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ భైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సూరారెడ్డి, శివ, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, యు.వెంకటాపురం, వీరయ్య, వెల్దుర్తి సీతారామయ్య ఎస్ఆర్‌పేట లోకేష్‌యాదవ్, మిట్టపల్లె ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యాన్ని ప్రకటించండి

కడప ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం ఒక కరువు భత్యాన్ని అయినా ప్రకటించాలని తెలిపారు. పీఆర్సీ గడువు దాటి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్న ఐఆర్ ఊసే లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. అనంతరం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్, మహిళా కార్యదర్శి పద్మజ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల వైఖరిపై అద్దెబస్సు డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న అద్దెబస్సుల డ్రైవర్లు

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైర్డ్ బస్సు డ్రైవర్ చక్రవర్తి(30) ఆత్మహత్య కు ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సోమవారం అద్దె బస్సుల డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తి , ఖాజీపేట మండలం బుద్దాయపల్లె నుంచి డ్యూటీకి వచ్చి వెళ్లేవాడన్నారు. బస్ పాస్ రెన్యువల్ కోసం డీఎం కార్యాలయంలోని క్లర్క్ శంకర గౌడ్‌ను కోరాడు. మూడు రోజులు తిప్పుకున్న ఆ ఉద్యోగి రెన్యువల్ చేయకపోవడంతో, చక్రవర్తి మద్యం సేవించి క్లర్క్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అతనిపై అక్రమంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయించి కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి, రీజనల్ మేనేజర్ గోపాల్ రెడ్డి వద్దకు పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో విసిగివేసారిపోయాడన్నారు. జనవరి 25 నుంచి డ్యూటీలోకి తీసుకోకపోవడంతో మనస్తాపం చెందిన అతను బైక్‌తో లారీని ఢీకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య తెలిపిందన్నారు. ఇలాంటి సమస్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ప్రైవేట్ బస్సుల మేనేజర్లు సాల్మన్, డానియేల్, నరేష్, శ్రీను ప్రైవేట్ బస్ డ్రైవర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రసాద్, పవన్. బాబ్జి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల ఘర్షణ : ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న యువకులు

కమలాపురం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని అక్కానగర్‌కు చెందిన యువ కుల ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల క థనం మేరకు ర్యాష్ డ్రైవింగ్ విషయంలో సాల్మన్ అనే యువకుడిని పలుసార్లు షాబాజ్, సోయల్ అనే యువకులు మందలించారు. ఆ విషయం మనసులో పె ట్టుకున్న సాల్మన్ రంజాన్ రోజు రాత్రి మద్యం తాగి అక్కా నగర్‌కు వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయడంతో షాబాజ్, సోయల్ గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులను రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో డీవైఈవో మృతి


డీవైఈవో చంద్రశేఖర్(ఫైల్)

మదనపల్లె టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం ప్రశాంతనగర్‌లో నివాస ముంటున్న చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ అనా రోగ్యంతో మృతి చెందారు. గత వారం రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్న ఆయన సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన స్వగ్రామం దేవళ చెరువులో అంత్య క్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్టీయూ నాయకులు రమణప్ప, మధుసూదన్ ఒక ప్రకటనలో ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్

● వాడవాడలా రంజాన్ వేడుకలు ● ఈద్గాలలో ప్రార్థనలు చేసిన ముస్లింలు



మదనపల్లెలో ఉపన్యసిస్తున్న మత గురువు

మదనపల్లె అర్బన్ మార్చి 31(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి, దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ అని ఇస్లాం మతగురువు సోయాబ్ మౌలానా అన్నారు. రంజాన్ సందర్భంగా సోమవారం బెంగళూరు రోడ్డులోని ప్రధాన ఈద్గాలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. అనంతరం మతగురువ ధార్మిక ఉపన్యాసం చేశారు. దివ్యఖురాన్ ముస్లింలకు శిరోధార్యమన్నారు. అందరితో స్నేహభావం కలిగి ఉండబాలని, చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. జామియా మసీదులో గురువులు, బసినికొండ ఈద్గాల్లో ముక్తి అబ్దుల్ రెహ్మాన్‌సాహెబ్, ఆయా మసీదుల్లో ఇమామ్‌లు ధార్మిక ఉపన్యాసం చేశారు. అలాగే మండలంలోని బసినికొండ, సీటీఎం, పోతబోలు, ఆరోగ్యవరం, వలసపల్లె, టీకేపల్లె, కురవంక తదితర ఈద్గాల్లో ముస్లింలు ఈద్ నమాజ్ ఆచరించారు.

పీలేరులో...

పీలేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉపవాసాలతో దేహ-ఆత్మ శుద్ధి, తరావీహ్ నమాజులలో ఖురాన్ శ్రవణంతో పుణ్యం, జకాత్ దానంతో సంపద శుద్ధి కల్పించిన పవిత్ర రంజాన్ మాసాన్ని తమకు ఈ ఏడాది ప్రసాదించినందుకు కృతజ్ఞత, మరోమారు ప్రసాదించాలని వేడుకోలు, శుభాకాంక్షలతో పీలేరు మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మదనపల్లె మార్గంలోని ఈద్గాలో సామూహిక నమాజు చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పాలని, పేదరికాన్ని అంతమొందించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే తలపుల, రేగళ్లు, బోడుమల్లువారిపల్లె, ఆరంవారిపల్లె, శివరామాపురం గ్రామాల్లోనూ పండుగ నమాజును ఆచరించారు.



నిమ్మనపల్లిలో వక్ఫ్‌బోర్డు బిల్లుకు నిరసన తెలుపుతున్న ముస్లింలు

నిమ్మనపల్లిలో..

నిమ్మనపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో సోమవారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లి, సైదాపేట, ముష్టూరు, చల్లావారిపల్లి తదితర ప్రాంతాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు అలింగనం చేసుకొంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం, మార్చి 31(ఆంధ్రజ్యోతి) మండలంలో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి, శివపురం, సిద్దవరం, వెలిగల్లు, పాపేపల్లి, ముసలికుంట, బండ్రేవు, గుడిసెవారిపల్లి, గురివిరెడ్డిగారిపల్లి ఆయా గ్రామాల సమీపంలోని ఈద్గాలలో ప్రత్యేక నమాజ్ చేశారు. ప్రతి ఒక్కరు దైవభక్తితో మెలగాలన్నారు. మత పెద్దలు, ఇమాంలు, హజరత్‌లు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ములకలచెరువులో ఉదయం పెద్దఎత్తున షాదీమహల్ వద్దనున్న ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు రంజాన్ ప్రత్యేకత గురించి వివరించారు. అలాగే బురకాయలకోట, దేవళచెరువు, సోంపల్లె, కాలువపల్లె, వేపూరికోట, చౌడసముద్రం, కదిరినాథునికోట తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని తిరుమలరెడ్డిపల్లె, చెంబకూరు, నడింపల్లె, గొల్లపల్లె, ఊలపాడు, కేసీపల్లె, గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ముతవల్లి సిరాజ్‌బాషా మాట్లాడుతూ హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా మెలగాలని, వర్షాలు బాగా కురిసి రైతులు సుఖశాంతులతో ఉండాలని అల్లాను వేడుకున్నట్లు తెలిపారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం సోమవారం రంజాన్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పెద్దలు, యువకులు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి మసీదు, ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తంబళ్లపల్లె మండల కేంద్రంలో ముస్లింలు ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయం స్థానిక ఈద్గాల వద్దకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే రంగసముద్రం, విసనకర్రవాండ్లపల్లె, పులికల్లు కందుకూరు, మల్లెల, చెన్నరాయునిపల్లె, గ్రామాల్లోని ఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కురబలకోటలో..

కురబలకోట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పరోపకారమే పరమావధిగా జీవితాన్ని కొనసాగించాలని మతగురువులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్లు, కురబలకోట, ముదివేడు, నందిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ఇమామ్‌ల సందేశాన్ని ఆలకించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్‌లను ధరించి ప్రార్థనలు చేశారు.

కలకడలో..

కలకడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ, ఎర్రయ్యగారిపల్లె, ఎర్రకోటపల్లె, కోన, బంగారువాండ్లపల్లె తదితర గ్రామాల్లో ఈద్గాల వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ర్యాలీగా బస్టాండు కూడలి వరకు చేరుకొని వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లను ధరించి నిరసన వ్యక్తం చేశారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల వ్యాప్తంగా సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షల అనంతరం సోమవారం పట్టణంలోని మసీదులలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా బయలుదేరి స్థానిక బైపాస్‌రోడ్డు, నమాజ్‌కట్టవీధి ప్రాంతాలలోని ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అక్కడ రంజాన్ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లె, టేకలకోన, మంచూరు, మాధవరంపల్లె తదితర ప్రాంతాలలో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

నిమ్మనపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక పాత మసీదు వద్ద ముస్లింలు నల్లరిబ్బను కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లు ముస్లింలకు పూర్తి వ్యతిరేకంగా వుందన్నారు. ఈ బిల్లులో సవరణలు చేయడం వలన వక్ఫ్ బోర్డు ద్వారా ముస్లింలకు కలిగే ప్రయోజనాన్ని ప్రభుత్వం అందుకోవాలని చూస్తోందని, బిల్లులో ఎలాంటి మార్పులు చేయరాదని కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

మదనపల్లె అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ బిల్లు సవరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చేతికి నల్లరిబన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజంపై దాడిగా అభివర్ణించారు. ముస్లింలకు వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు మద్దతు పలికాయి. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషార్ అహ్మద్ వైసీపి నాయకులతో కలిసి నిరసనలో పాల్గొనగా, కాంగ్రెస్ నేత షేక్ రెడ్డిసాహెబ్ ముస్లింతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ జోలికి రావొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



పీలేరులో..



ములకలచెరువులో..



కలకడలో..



మదనపల్లె పట్టణంలో బెంగళూరు రోడ్డులో ఉన్న ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మీయుల కోసం ఎదురుచూపు

● తిరుపతి రుయా ఆస్పత్రిలో అనాథ శవం



మృతుడు జయరాం

మదనపల్లె అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు బస్టాండ్‌లో గత నెల 22వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుప్రక్కన పడి ఉండగా స్థానికులు గుర్తించి 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 23వ తేదీన మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. 108సిబ్బంది ఈయనను తిరుపతిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో తన పేరు జయరాం(55) అని చెప్పినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్ తెలిపారు. ఆత్మీయుల కోసం జయరాం మృతదేహం ఎదురు చూస్తోందని, ఎవరైనా బంధువులు ఉంటే వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆయన కోరారు. మృతదేహం తిరుపతి రుయా ఆస్పత్రి శవగారంలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

రాత్రి 10గంటల్లోపు దుకాణాలు బంద్ చేయాలి

● డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్ మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో మదనపల్లె పట్టణంలో పొడిగించిన సమయం లేకుండా నేటి నుంచి అనగా మంగళవారం నుంచి రాత్రి పది గంటల్లోపే హోటళ్లు, షాపులు మూసివేయాలని డీఎస్పీ కొండయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల నేపథ్యంలో హోటళ్లు, షాపుల మూసే సమయం కొద్దిగా పొడిగించామని, నేటి నుంచి ఆ పొడిగింపు ఉండదన్నారు. పోలీసుల నిబంధనలు తప్పక పాటించి సహకరించాలని డీఎస్పీ కోరారు.

యమలా సుదర్శనం దంపతులకు సన్మానం

వాల్మీకిపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దళితుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న యమలా సుదర్శనంకు అంబేడ్కర్ సేవారత్న అవార్డు రావడంతో మాల మహానాడు మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వాల్మీకిపురం విచ్చేసిన యమలా సుదర్శనం దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగార్జున, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాక్షుడు వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి సుధాకర్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, దళితులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

● నూతన చైర్మన్ చంద్రమౌళి

వాల్మీకిపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడుపుతూ ఆదాయ మార్గాలను పెంచే దిశగా కృషి చేస్తానని చైర్మన్ కోసూరి చంద్రమౌళి అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన కోసూరి చంద్రమౌళి సోమవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని నగిరిపల్లెలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు పులి సత్యారెడ్డి, శేషాద్రిరెడ్డి, పీవీ నారాయణ, కేకేనాయుడు, మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న కోసూరి చంద్రమౌళి

ఎస్సీ, ఎస్టీల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వినాయకం

పీలేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ పిల్లల్లో విద్యాభివృద్ధికి తాము ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వినాయకం అన్నారు. పీలేరులో ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను నెలలో రెండుసార్లు విధిగా సందర్శించి అక్కడి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. సంఘం తరపున ప్రతి నెలా ఒక ఎస్సీ, ఎస్టీ గ్రామానికి వెళ్లి అక్కడి ప్రజల స్థితిగతులను అధ్యయనం చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థికసాయం అందించి వారు ఉన్నత చదువులు అభ్యసించే విధంగా చైతన్యం నింపాలన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న సెలవు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్సీ, నవోదయ, డైట్, పాలిటెక్నిక్ లాంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లూరు శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్, నాయకులు శ్రీనివాసులు, శేషాద్రి, రెడ్డప్ప, కృష్ణయ్య, వెంకటరమణ, వినోద్, ప్రసాద్, మోహన్, చిన్నరాజ్, రాజగోపాల్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో విహరించిన దేవదేవుళ్లు

● మల్లెల, పీటీఎం గ్రామాల్లో ఘనంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దతిప్పసమద్రం మల్లెల గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. పురవీధుల్లో మేళతాళాలు, బళ్లారి డ్రమ్ములతో, చెక్కల భజనలతో స్వామివారిని ఊరేగించారు.



రెండు వేరుశెనగ కట్టె వాముల దగ్ధం

● సుమారు రూ.60వేల ఆస్తి నష్టం

తంబళ్లపల్లె, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పశువుల మేత కోసం ఓ రైతు నిల్వ చేసుకున్న రెండు వాముల వేరుశెనగ కట్టెతో పాటు 15 వరి గడ్డి కట్టలు అగ్నికి ఆహుతైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఆ వివరాలల్లోకి వెళితే.. మండలంలోని పరుసతోపు పంచాయతీ చెన్నప్పగారిపల్లెకు చెందిన కుమార్‌నాయుడు వ్యవసాయం చేసుకుంటూ ఆరు పాడిఆవులను పోషించుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పశువుల మేత కోసం తన నాలుగెకరాల పొలంలో సాగు చేసిన వేరుశెనగ కట్టెను రెండు వాములుగా వేసి పల్లెలో నిల్వ చేశాడు. అలాగే మరో 30 కట్టల (ఒక్కో కట్ట రూ.230) వరి గడ్డిని కొనుగోలు చేసి వాముల వద్ద నిల్వ చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన రైతు స్థానికుల సహాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఈ ప్రమాదంలో రెండు వేరుశెనగ కట్టె వాములు పూర్తిగా కాలి బూడిదవ్వడంతో పాటు 15 వరకు వరిగడ్డి కట్టలు కాలిపోయి సుమారు రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోతున్నాడు. కష్టపడి సాగు చేసి పశువుల మేత కోసం నిల్వ చేసుకున్న గడ్డి కళ్ల ముందే కాలిపోవడంతో రైతు బోరున విలపిస్తున్నాడు.

రేణుకా యల్లమ్మ తిరునాళ్లు ప్రారంభం

ములకలచెరువు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళచెరువు పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెలో వెలసిన రేణుకా యల్లమ్మ తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు చేపట్టారు. అలాగే మంగళ, బుధవారాలలో తిరునాళ్ల ఉత్సవాలు జరగనున్నాయి.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పుష్ప పల్లకీలో చౌడమ్మ తల్లి..

● వైభవంగా అమ్మవారి పగలు తిరునాళ్లు



పుష్పాలంకరణలో ఊరేగుతున్న చౌడేశ్వరీ అమ్మవారు

మదనపల్లె అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జ్యోతులతో పాటు అమ్మవారి పుష్పపల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు చెక్కభజనలు, మేళతాళాలతో, మంగళవాయిద్యాల, బాణసంచా పేలుళ్ల నడుమ వైభవంగా జరిగింది. రాత్రి స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా టీడీపీ నాయకులతో కలిసి చౌడేశ్వరీదేవిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రద్దీ ఏర్పడి ఆలయం కిక్కిరిసిపోయింది. రోడ్లు అన్ని జనంతో నిండిపోయాయి. నీరుగట్టువారిపల్లెలోని పురవీధుల్లో రాత్రంతా ఊరేగింపు సాగింది. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, వైసీపీ మదనపల్లె నియోజకవర్గం ఇన్‌చార్జీ నిషార్ అహమ్మద్‌తో పాటు కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దండు రామాంజులు, శీలం రమేష్‌బాబు, కౌన్సిలర్ రామిశెట్టి శివా, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టూటౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి బండి పవన్‌కుమార్, ట్రెజరర్ రామిశెట్టి రత్నమయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు బండి మనోహర్, మాజీ కౌన్సిలర్లు బండి నాగరాజ, రామిశెట్టి నీలకర, రామిశెట్టి అంజనేయులు, కమలామరి కృష్ణ, ఉప్పు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

వైభవంగా చౌడేశ్వరీ దేవి ఉత్సవం

కలకడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనలో కొలువైన చౌడేశ్వరీ దేవి ఉత్సవాన్ని సోమవారం తోగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో కోన చౌడేశ్వరీ దేవి